


పొదలకూరు
జ్ఞానసుందర్

**గజనీ మహమ్మద్** దండయాత్రలు గురించి కొన్ని పేజీలు మాత్రం రాయొచ్చు. కానీ ఈ కథలో సుబ్రావ్ గురించి వ్రాసుకుంటూపోతే ఎక్కడ తేలుతానో మనకే తెలియదు. అయినా గట్టిగా ట్రై చేసి వీలైనంత బ్రీఫ్‌గా చెప్పేస్తాను.

సుబ్రావ్ ఉన్న వూళ్ళోనే బియ్యే వెలగబెడుతున్నాడు. చాలారోజులుగా సుబ్రావ్‌కు ఎవ్వరినైనా (?) డీప్‌గా (36 అడుగుల లోతులో) లవ్వాడాలనే ఐడియా ఎద గదిలో నాటుకుపోయింది. సుబ్రావ్‌కు క్లాస్‌మేట్ ఒకడున్నాడు. పేరు గంటారెడ్డి. అందరూ అతని 'బెల్‌రెడ్డి' అని పిలవడం ఆనవాయితీ. ఇద్దరూ ఒక కంచంలో పడుకొని (!) ఒక మంచంలో తినకపోయినా (?) చాలా మందమైన స్నేహితులు (థిక్కెస్ట్ ఫ్రెండ్స్). బెల్‌రెడ్డి, అతని చెల్లెలు రంగమణి సొంత వూళ్ళో సీట్ దొరక్క సుబ్రావ్ ఉన్న వూళ్ళో చేరారు గది అద్దెకు తీసుకొని.

రంగమణి ఇంటర్ ఫైనల్ ఇయర్. సుబ్రావ్ చెల్లెలు అలివేలు టెన్త్ ఫెయిల్ అయి ఇంటి దగ్గరే తెలుగు నవలలు చదువుకొంటూంది.

ఓ సారి —

సుబ్రావ్, బెల్‌రెడ్డి, రంగమణి షాపింగ్ కనివచ్చి ఒక హోటల్ ముందున్న బోర్డు చూసి టక్కున ఆగిపోయాడు సుబ్రావ్. ఆ బోర్డులో—

స్పెషల్ మసాలా
పెరుగువడ
ఆంధ్రా దోసె
తయార్ —

అని వ్రాసుంది. వెంటనే బెల్‌రెడ్డిని, రంగమణిని హోటల్‌కు తీసుకెళ్ళి తయార్ మూడు ప్లేట్లు పట్రా అన్నాడు. వాడు అర్థం కాకుండా— ఏమిటిసార్'' అన్నాడు. ''చెప్పుదా ఏమిటి? తయార్ మూడు ప్లేట్లు పట్రా అన్నాడు. హోటల్‌లో వాళ్ళంతా వీళ్ళకేసి వింతగా చూస్తున్నారు. ఇంతలో మేనేజర్ వచ్చి ''ఏమిటయ్యా గొడవ'' అన్నాడు. వీళ్ళు తయార్ పట్రామన్నారు. బిక్క మొకం వేసుకొని నిల్చున్నాడు. చూడండి'' మేనేజర్ ''తయార్ ఏమిటి'' అని అడిగాడు బయట బోర్డులో రాసుంది చూడవయ్యా బాబు అన్నాడు సుబ్రావ్ మేనేజర్ విలన్‌లా ఒక నవ్వు నవ్వి పెయింటర్ తయారుగా ఉన్నది అని వ్రాయమంటే స్థలం చాలక అలా 'తయార్ అని వ్రాశాడు సార్ అన్నాడు. సుబ్రావ్ తలవంచుకొచ్చేశాడు రంగమణి ముందు తల ఎత్తలేక.

ఒక శుభ ముహూర్తాన రంగమణిని లవ్వాడలనే దృఢ నిశ్చయానికి వచ్చేశాడు సుబ్రావ్ బ్రాకెట్ బియ్యే. ప్రేమకు నాంది గీతం పలుకుతూ ఒక ఆర్టిస్టు దగ్గర కెళ్ళి నీట్‌గా లవ్ లెటర్ వ్రాసుకున్నాడు. (సుబ్రావ్‌కు చదువు రాక గాదు. తన అక్షరాలు తనకే అర్థం కాదనే పచ్చి నిజం తెలుసు గనక.)

సుబ్రావ్ అంటే అంతకుముందే అభిమానం ఉండి ఏడ్చింది. అందుకే వెంటనే పచ్చ జెండా వూపేసింది రంగమణి.

సుబ్రావ్ ఇంటికి బెల్‌రెడ్డి వచ్చినప్పుడల్లా వాళ్ళిద్దరూ కలిసి ఇంగ్లీషులో మాట్లాడుకునేవారు. ఇది చూసిన అలివేలు (సుబ్రావ్ చెల్లెలు) చదివే నవల పక్కన బెట్టి నోరు తెరుచుకొని వింటూండేది (నోట్లోకి ఈగలు వెళ్తూ వస్తూండడం తెలియక) బెల్‌రెడ్డి మాట్లాడే ఇంగ్లీషు వల్ల అయితేనేమి పర్సనాల్టీ (?) వల్ల అయితేనేమి లవ్ పుట్టుకొచ్చేసింది అతనిపైన.

అలివేలుకు ఒక అలవాటు. తెలుగు నవలలు చదివేప్పుడల్లా నవలలోని మంచి ప్రేమకొటేషన్స్ రాసి ఉంచుకొనేది. ఇప్పుడు ఆ కొటేషన్స్ అంతా గుప్పించి లవ్ లెటర్ వ్రాసి బెల్‌రెడ్డి కిచ్చేసింది.

అలివేలు వ్రాసిన లవ్‌లెటర్ తివిరి తీరా ఒక వందమార్లు చదువుకొని, లవ్‌లెటర్‌కో వంద ముద్దులిచ్చి, అలివేలుకు ఒక ముద్దిచ్చేశాడు ఫ్రీగా.

వెంటనే అద్దంలో వెళ్ళి చూసుకుంది, అలివేలు బుగ్గ కందిపోయిందేమోనని (నవలలో బుగ్గ కందిపోవడం గురించి ఇంతక్రితం చదివిందిగాబట్టి) కాని అలా జరక్కపోవడం చూసి బాధ వేసింది.

ఇద్దరు మిత్రుల ఇంగ్లీషు పాండిత్యానికి తెగ ఆశ్చర్యపడిపోకండి! బెల్‌రెడ్డికి, సుబ్రావ్‌కు ఇంగ్లీషు అంత బాగా రానిమాట నిజం. కాని అందులో ఉందో కిటుకు. ఎలా అంటే సుబ్రావ్ బెల్‌రెడ్డికి కలిసి టెన్త్‌క్లాస్ ఇంగ్లీషు గైడ్‌లోని ఒక ఇంగ్లీషు ఎస్సే (మల భంగా ఉండేది సుమా!) ఎన్నుకొని ఇద్దరూ ఒకనెల వరకు తెగబట్టీ పెట్టేసేవారు. ఆ తరవాత సుబ్రావ్ ఆ ఎస్సేలోని మొదట లైన్ చెప్పేవాడు వెంటనే బెల్‌రెడ్డి ఆ వెనకాల లైన్ చెప్పేవాడు.

ఎలా అయితేనేం సుబ్రావ్ రంగమణిని అలివేలు బెల్‌రెడ్డిని లవ్‌చేయడం మొదలెట్టారు సీరియస్‌గా.

• •    • •    • •

బెల్‌రెడ్డి, రంగమణి ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ రాసేసి వాళ్ళూరు వెళ్ళిపోయారు. రంగమణి వెళ్ళినప్ప

ట్నుంచి సుబ్రావ్ ప్రతిరోజు రాత్రి డాబా ఎక్కి ఘంటసాల విరహగీతాలు పాడేవాడు. ఘంటసాల చనిపోకుండా ఉండి ఉంటే సుబ్రావ్ పాటలు విని ఎంత కష్టపడిపోయేవాడో!.

ఇక అలివేలు కథ చెప్పక్కర్లేదు. బెల్‌రెడ్డికి ఉత్తరాలు రాసేది ఇలా—

"నీవు లేని నా జీవితం అడవి కాచిన వెన్నెల, తెరచాప లేని నావ, మోడు వారిన చెట్టు. ప్రియా! త్వరగా వచ్చే సేయి. నీ కోసం వేయి కన్నులతో ఎదురు చూచుచుందును.

ఇట్లు
నీ హృదయేశ్వరి
అలివేలు —" అని.

• • •

ఆరోజు —

సుబ్రావ్ నాన్న శేషయ్య అలివేలును సుబ్రావ్‌ను పిల్చి "మీకు పెళ్ళి చేయాలనుకుంటున్నాను" అన్నాడు.

"మా కిష్టం లేదు" అన్నారు అన్నా చెల్లెలు ఇద్దరూ ఒకేసారి.

"మీ కిష్టం ఉన్నా లేకపోయినా తప్పక చేసుకోవాల్సిందే" అన్నాడు శేషయ్య.

ఇది జరిగిన ఒక వారం తరవాత ఇంట్లో అందరూ నిద్రలేచి చూసేసరికి అలివేలు కనపడలేదు. బావులు, గుంటలు, చెరువులు అన్నీ వెతికేశారు. ఇష్టం లేని పెళ్ళి కాబట్టి ఏనుయ్యో, గొయ్యో చూసుకునిందేమోనని. చెల్లెలు ఏమైందో సుబ్రావ్‌కు అంతు చిక్కలేదు. సుబ్రావ్ రంగమణిని కలవని క్షణం లేకపోయింది. విరహగీతాలు రాయడం మొదలెట్టాడు. (ప్రేమ ముదిరితే, కవిత్వం వస్తుందని ఎక్కడో చదివాడట). రెండ్రోజులకు సుబ్రావ్ కూడా కనబడలేదు. వీళ్ళిద్దరి విషయం శేషయ్యకు అంతు చిక్కక జుట్టు పీక్కున్నాడు. వెంటనే ఒక పిడికెడు వెంట్రుకలు చేతికొచ్చే లోపల జుట్టు పీక్కోవడం మానేశాడు.

• • •

ఇప్పుడు మనం మెల్లగా కెమెరా కార్వేటినగరం రిజిస్ట్రాఫీసు వైపు తిప్పి (లాంగ్ షాటులో చూసామంటే) సుబ్రావ్ రంగమణి, ఇంకో వ్యక్తి (లాంగ్‌షాట్‌లో) మూడో వ్యక్తి ఎవ్వరో క్లియర్‌గా కనపడడం లేదు అతగాడితో మనకు అంత ప్రమేయం లేదు కదా!) మాటలు మాత్రం వినబడుతున్నాయి. సుబ్రావ్ ఆ మూడో వ్యక్తిని అడుక్కుంటున్నాడు. "సార్! దయచేసి సాక్షి సంతకం చేయండి. నూరు రూపాయలు ఇస్తాను" అని. అందు కతడు, "ఇదేమి వంకాయల బేరం అనుకున్నావా? నువ్వేదో అమాయకుడని రెండువందలకు ఒప్పుకున్నా (అమాయకుడనే, రెండొందలు అడుగుతున్నాడు అనే విషయం తెలియదు మన సుబ్రావ్‌కు). సుబ్రావ్ ఒప్పేసుకున్నాడు. ముగ్గురు రిజిస్ట్రాఫీసుకు వెళ్ళారు. కాస్సేపు తరవాత పూలమాలలతో బైటొచ్చారు రంగమణి సుబ్రావ్.

• • •

సుబ్రావ్ గది తాళం తీస్తుండగా, పక్క రూమ్‌కు తాళం వేస్తూ కనపడ్డాడు బెల్‌రెడ్డి. పక్కనే అలివేలు మెడలో తాళి. ఒక్కక్షణం నలుగురూ నోట మాట రాక నిల్చిపోయారు.

సుబ్రావ్ తేరుకుని "అందరం దొంగలమే అన్నమాట" అన్నాడు. అలివేలు, బెల్‌రెడ్డి ఆశ్చర్యం లో నుంచి తేరుకోలేదు కనక ఆ మాటకు జవాబివ్వలేదు. నలుగురూ ఆ రోజంతా ఆ వూళ్ళో ఉన్న ఆ ఒక్క లాడ్జిలోనే గడిపి, మరుసటి రోజు సుబ్రావ్ ఇంటికి వచ్చారు.

వచ్చి నేరుగా సుబ్రావ్ ఫాదర్ శేషయ్య కాళ్ళపై పడ్డారు. శేషయ్య కత్తి పుచ్చుకోలేదు. కత్తులు విసరలేదు. చిందులు తొక్కనూ లేదు. కిందపడబోయి తరవాత నిలదొక్కుని—

"ఏమిట్రా ఇలా చేశారు!" అని మాత్రం అన్నాడు. నలుగురూ దిక్కు మొహాలు వేసి నిల్చుకొని ఉండడం చూసి మళ్ళా అతనే

"పిచ్చి నన్నాసుల్లారా నేను అనుకున్నది మీరు చేసే సారు! మరి నాతో ఒక్క మాట చెప్పుండొచ్చు కదా" అన్నాడు. సుబ్రావ్‌కు ఇది అర్థం కాకుండా "ఏమిటి నాన్నగారు" అన్నాడు భయపడుతూ.

"నీకు రంగమణిని, మా చెల్లెలకు గుంటూరెడ్డిని ఇచ్చేయాలనుకొని నిర్ణయించుకొన్నాను. అయినా నాదే తప్పు. నేను మొదట్నే మీకు చెప్పుండాల్సింది. ఖర్చేదులే పెళ్ళిఖర్చులు మిగిలిపోయాయి" అన్నాడు శేషయ్య. "నిజం నిజం" అన్నారు నలుగురూ ఒకేసారి కోరస్‌లా! ★


రు. 40,000 విలువచేసే బహుమతులు గెలవండి

**NATIONAL FAN Quiz Contest.**

1వ బహుమతి టి.వి. లేదా రూ 2,500 - నగదు.
2వ బహుమతి టేప్ రికార్డర్ లేదా రూ. 1000/- నగదు.
*3rd Prize 100* Mixer Grinder on reduced rate 280/-
or National Fan Or 2 Band Transistor 180/-

**This is a Sales promotion Plan. Its aim is to popularies our National Fan through out India.**

పొందేట్టు చేయడమే దీని ధ్యేయం.

ఈ క్రింది మూడు లైనులలో మేము పదకొండునుంచి 19 వరకు అంకెలను ఎటునుంచి కూడినా మొత్తం నలభైఅయిదు వచ్చే విధంగా ఉపయోగించాము.

| | | |
|---|---|---|
| పన్నెండు | పదిహేడు | పదహారు |
| పందొమ్మిది | పదిహేను | పదకొండు |
| పద్నాలుగు | పదమూడు | పద్దెనిమిది |

మీరు చేయవలసినది :-
అదే విధంగా మీరు పన్నెండు నుంచి ఇరవై వరకు అంకెలను మూడు లైనులలో ఎటు వైపు నుంచి కూడినా నూరే నలభై ఎనిమిది వచ్చే విధంగా ఉపయోగించవచ్చును ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి.

Available at all leading Stores




Subjected to over 120 quality tests.
Blades perfectly designed for maximum breeze.
The most-preferred double ball bearing far

నిబంధనలు. షరతులు : ఒక కుటుంబం నుంచి కేవలం ఒక ఎంట్రీ మాత్రమే అనుమతిస్తాము తెల్ల కాగితం మీద లేదా పోస్ట్ కార్డు మీద కూడా వ్రాసి ఎంట్రీ పంపించవచ్చును సరియైన సొల్యూషన్‌లకు బహుమతి యివ్వబడు ఫలితాలు నిర్ణయమైన వెంటనే విజేతలకు తెలియబడుతుంది డైరెక్టర్ వారి నిర్ణయం తుది నిర్ణయం మీ ఎంట్రీని 15 రోజుల్లోగా పంపించండి
మీ చిరునామా ఇంగ్లీషులో లేదా హిందీలో మాత్రమే వ్రాయండి

**NATIONAL TRADING COMPANY**
**8996, Shidipura Karol Bagh New Delhi - 5.**